నేతకానీలకు ప్రత్యేక గ్రూపు కేటాయించాలి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 23: ఎస్సీ వర్గీకరణ, కులగణనలో నేతకానీ మహర్ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దుర్గం రాజేశ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో నేతకానీలు రూ.15 లక్షలకు పైబడి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిపిన కుల గణనలో కేవలం 1.33 లక్షల మంది ఉన్నట్లు చూపించారని అన్నారు. దీనివల్ల తాము ఎస్సీ వర్గీకరణలో నష్టపోయే అవకాశం ఉన్నదని, అత్యల్పంగా ఉన్న బుడగ జంగాలకు ప్రత్యేక గ్రూపును ఏర్పాటుచేసి, అధిక జనాభా ఉన్న తమకు ఏర్పాటుచేయకపోవడం బాధాకరమన్నారు. కుల వర్గీకరణలో నేతకానీలకు ప్రత్యేక గ్రూపును కేటాయించడంతో పాటు నేతకానీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకానీ మహర్ సంక్షేమ సంఘం నాయకులు దుర్గం నర్సయ్య, సెగ్గం రాజేశ్, భువనచంద్ర, సోంబాయి, జాడి దీపక్, గోశ్న రాజమల్లు, కామెర ప్రకాశ్, దుర్గం శేఖర్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నూర్‌లో వాటర్ ప్లాంట్లు బంద్

చెన్నూర్, ఫిబ్రవరి 23: మున్సిపాలిటీ అధికారుల వేధింపులను నిరసిస్తూ చెన్నూర్‌లో సోమవారం నుంచి మినరల్ వాటర్ ప్లాంట్లను మూసి వేస్తున్నట్లు యజమానులు తెలిపారు. మినరల్ ప్లాంట్లకు ఐఎస్‌వో స్టాండర్డ్ పాటించాలని, ఐఎస్‌వో సర్టిఫికెట్ ఉంటేనే ప్లాంట్లు నడపాలని మున్సిపాలిటీ అధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. ఐఎస్‌వో అనుమతి కావాలంటే రూ.25లక్షల వరకు ఖర్చు అవుతుందని వారు తెలిపారు. ఐఎస్‌వో కోసం తమకు అంత ఖర్చు పెట్టే ఆర్థిక స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లు ఉన్నాయని, అక్కడ లేని నిబంధనలు కేవలం చెన్నూర్ పట్టణంలోనే ఎందుకని వారు మున్సిపాలిటీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చెన్నూర్ పట్టణంలో డయేరియా ప్రబలి పట్టణంలో మున్సిపాలిటీ వారు సరఫరా చేసే నీటిని ప్రజలు తాగడం లేదని వారు తెలిపారు. దీంతో వాటర్ ప్లాంట్లను మూసివేయడంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం మరింత ఇబ్బంది పడుతారని తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కౌటాల, ఫిబ్రవరి 23 : సిర్పూర్ (టీ) మండలంలోని భీమన్న ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మామిడి వెంకటేశ్(35) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద గల ఆధార్ కార్డు ఆధారంగా కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మ బస్తీకి చెందిన మామిడి వెంకటేశ్‌గా స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి, దర్యాప్తు జరుపుతున్నట్లు సిర్పూర్ (టీ) పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

మందమర్రి, ఫిబ్రవరి 23: ద్విచక్ర వాహనం అదుపుతప్పి షేక్ జిలాని(30) మృతి చెందాడు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన షేక్ ముగ్దుమ్, షేక్ జిలాని అన్నదమ్ములు ఆదివారం ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు వెళ్లి బెల్లంపల్లికి వస్తున్నారు. స్థానిక జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైన షేక్ జిలాని నడుపుతున్న బైక్ అదుపు తప్పి కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీ కొనడంతో జిలానీ అక్కడిక్కడే మరణించగా ముగ్దుమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ముగ్దుమ్‌ను బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. జిలానీకి ఇంకా వివాహం కాలేదని అతని బావమరిది షేక్ సలీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

తాండూర్, ఫిబ్రవరి 23 : రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన తాండూర్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్‌కు చెందిన వడాల దుర్గమ్మ(50) తీర్థయాత్రలకు పోయి వస్తూ తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. దుర్గమ్మ భర్త మృతి చెందాడు. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

సెల్‌ఫోన్ అందజేత

దండేపల్లి, ఫిబ్రవరి 23: దండేపల్లి మండలంలోని మాదాపూర్‌కు చెందిన భీమెల్ల వినయ్‌కుమార్ వీవో మొబైల్ ఫోన్‌ను మేదరిపేట మార్కెట్‌లో పోగొట్టుకోగా సీఈఐఆర్ ద్వారా ఆప్లై చేయడంతో ఫోన్‌ను గుర్తించి బాధితుడికి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ తహసినొద్దీన్ అందజేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నస్పూర్, ఫిబ్రవరి 23 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సికిందర్, కార్తీక్, వంశీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మత తత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 : మతత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే శంకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ కాలనీ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ రాజ్యాంగ సవరణ చేస్తూ బడా వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అమరజీవి కామ్రేడ్ నర్సయ్య స్ఫూర్తితో సీపీఐ పనిచేస్తుందన్నారు. సీపీఐ పార్టీ 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా సమితి సభ్యుడు రాజేశ్వర్‌రావు, ముస్కె సమ్మయ్య, కొట్టె కిషన్‌రావు, మహేశ్, నాయకులు సదానందం, రాంచంద్, లింగం రవి పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్

మారం జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు

హాజీపూర్, ఫిబ్రవరి 23 : అటవీశాఖలో ఖాళీగా ఉన్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ల భర్తీ చేసేందుకు కృషి చేస్తానని టీజీఈజేఏసీ చైర్మన్, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా ఆయనను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, టీఎన్జీవో ఫారెస్టు ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్యతో కలిసి ఫారెస్టు ఉద్యోగులు ఆయనను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల అటవీ శాఖకు వర్తింపజేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని, పోలీస్ శాఖలో వర్తిస్తున్న జీత భత్యాలతో పాటు యూనిఫాంను అందజేయాలన్నారు. ఖాళీల వివరాలను, సమస్యలను ఆయనకు వివరించి, సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రితో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని జగదీశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, లక్షెట్టిపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి అత్తె సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వేలాల భూవివాదంలో ఘర్షణ

దాడికి పాల్పడుతున్న వ్యక్తి

జైపూర్, ఫిబ్రవరి 23: జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేలాల గ్రామంలో ఆదివారం జరిగిన ఓ భూవివాదంలో దాడి చేసిన ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు ఐలి బానయ్య పెద్దపల్లి జిల్లా మంథనిలో నివాసముంటుండగా ఆదివారం వేలాలో తన ఇంటి స్థలం వద్దకు వచ్చాడు. ఆ స్థలంలో జాతర సందర్భంగా బొమ్మల దుకాణం ఏర్పాటు చేసుకోగా తనకు తెలియకుండా దుకాణాన్ని ఎలా ఏర్పాటు చేశావు అని మాట్లాడుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన జాడి లింగయ్య అతని కుమారుడు రామకృష్ణతో కలిసి దాడికి దిగినట్లు తెలిపారు. తన భార్య దుర్గమ్మ, బంధువు రాజేశ్వరిని కూడా కొట్టి, రాళ్లతో దాడి చేశారని ఫిర్యాదు చేశారు. తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తమ ఇంటి స్థలాన్ని తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

పేకాట స్థావరంపై దాడి

దండేపల్లి, ఫిబ్రవరి23: దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామ శివారులో రహస్యంగా పేకాడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తహసినొద్దీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...డబ్బులు పందెంగా పెట్టి పేకాడుతున్న నిజాముద్దీన్, ఎస్సనవేణి మల్లేశ్, బియ్యాల సత్తయ్య, జాడి మల్లేశ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వన్య ప్రాణుల మాంసం పట్టివేత

పట్టుకున్న వన్య ప్రాణులమాంసం, నిందితుడితో పోలీసులు

వేమనపల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని నీల్వాయి బస్టాండ్ సమీపంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వన్య ప్రాణుల మాంసాన్ని పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మండలంలోని కల్మలపేటకు చెందిన తోకల జీవన్ నక్కలపల్లి వైపు వెళ్తుండగా ఆపి తనిఖీలు చేశామన్నారు. తనిఖీల్లో దుప్పి, కుందేలు, అడవి పిల్లి మాంసం దొరికిందన్నారు. బ్యాటరీల సహాయంతో వన్య ప్రాణులను వేటాడి చంపి గుట్టుగా మాంసం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి దుప్పి తల, కాళ్లు, దుప్పి, కుందేలు, అడవి పిల్లి మాంసం స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయానికి వెండి పడగ విరాళం

విరాళం జైపూర్, ఫిబ్రవరి 23: వేలాల గట్టు మల్లన్నకు సుమారు రూ.70 వేల విలువగల వెండి పడగను రిటైర్డ్ ఫారెస్టు కన్జర్వేటర్ తిమ్మారెడ్డి-నివేదిత దంపతులు విరాళంగా ఇచ్చారు. ఆదివారం వేలాల గట్టుపై ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఈవో రమేశ్ సమక్షంలో పడగను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ అధికారి భగవంతరావు, ఎఫ్‌బీవో శ్రీధర్, నాయకులు డేగ రమేశ్, ప్యాగ లక్ష్మణ్ తదితరులున్నారు.

బస్టాండ్ లేక..ఎండలో విలవిల..

సీసీసీ కార్నర్ వద్ద ఎండలో నిలబడి బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

- సీసీసీ కార్నర్ వద్ద ప్రయాణికుల తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 23: సీసీసీ కార్నర్ వద్ద బస్టాండ్ లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం ఎండలోనే నిలబడి వేచి చూస్తున్నారు. చాలా రోజులగా ఇక్కడ బస్టాండ్ ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారు. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిసిన నస్పూర్ మున్సిపాలిటీలో దాదాపు 80వేలకు పైగా జనాభా ఉంది. ఇది వరకు సింగాపూర్, తీగల్‌పహాడ్, తాళ్లపల్లి, నస్పూర్ గ్రామ పంచాయతీలుగా ఉండేవి. ఈ ప్రాంతాలు పారిశ్రామికంగా దిన దినాభివృద్ధి చెందుతుండగాతో వీటన్నింటిని కలిపి 2019లో నస్పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మికులు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో శ్రీరాంపూర్‌కాలనీలో బస్టాండ్ ఏర్పాటు చేయగా, సీసీసీ, గోదావరికాలనీ షిర్కె, నస్పూర్‌కాలనీ, ఫ్లడ్‌కాలనీ, తదితర కాలనీలకు చెందిన ప్రజలు బస్సుల కోసం సీసీసీ కార్నర్‌కు వచ్చే వారు. రోజు రోజుకు ఇక్కడ ప్రయాణికుల రద్దీ పెరుగుతూ వచ్చింది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా గతంలో బస్టాండ్ ఏర్పాటు కోసం పిల్లర్లు వేశారు. వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. తర్వాత ఆ పిల్లర్లను సైతం తొలగించారు. రోడ్డు వెడల్పులో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన చిన్న చిన్న టేలాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. శాశ్వత బస్టాండ్ నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల కోసం సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు. ఇంత వరకు అది ఆచరణలోకి రాలేదు. ప్రస్తుతం పట్టణంలో జనాభా పెరిగిపోవడంతో పెద్ద సంఖ్యలో ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి బస్సుల కోసం ఇక్కడికి వేస్తే బస్టాండ్ లేక ఇబ్బంది పడుతున్నారు. వందలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లడానికి ఇక్కడికి వస్తుంటారు. ఎండను సైతం లెక్కచేయకుండా బస్సుల కోసం వేచి చూస్తున్నారు. ఇక వర్షాకాలం సమీపంలో ఉన్న షాపుల వద్ద నిలబడి బస్సు రాగానే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఫిబ్రవరి నుంచే ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు ముదిరితే ఇక్కడ నిలబడే పరిస్థితి కూడా ఉండదు. ఇప్పటికైనా శాశ్వతంగా బస్టాండ్ ఏర్పాటుచేయాలని, కనీసం తాత్కాలికంగా చలువ పందిళ్లు అయినా ఏర్పాటు చేసి ఎండల నుంచి, వడదెబ్బ నుంచి కాపాడాలని ప్రయాణికులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్ టౌన్ : గురుకులంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 23: తెలంగాణ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన టీజీ సెట్ ప్రశాంతంగా జరిగినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 3893 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 3828 మంది హాజరైనట్లు 65 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి : తనిఖీ చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 22 :ఉమ్మడి జిల్లాలోని గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న టీజీ సెట్ ప్రశాంతంగా ముగిసింది. బెల్లంపల్లిలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం కానుండగా పది గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి పంపించారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జోనల్ ఆఫీసర్ హెచ్ అరుణ కుమారి పర్యవేక్షించారు గురుకుల పాఠశాలలో మొత్తం 790 మంది విద్యార్థులు 771 మంది విద్యార్థులు హాజరు కాక 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ తెలిపారు.

సిర్పూర్‌లో కొనసాగుతున్న దోపిడీ

- నాసిరకంగా అండెవెళ్లి బ్రిడ్జి పనులు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అండెవెళ్లి బిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 23: సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీలు మారినా, ఎమ్మెల్యేలు మారినా దోపిడీ మాత్రం ఆగకుండా కొనసాగుతున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం సిర్పూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆయన పర్యటించారు. కాగజ్‌నగర్ మండలంలోని అండెవెళ్లి ఆప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గతంలో అండెవెళ్లి బ్రిడ్జీ నాసిరకంగా నిర్మించడంతో కొద్ది పాటి వర్షానికే కూలిపోయిందని గుర్తుచేశారు. బ్రిడ్జిల పేరుతో దోపిడీ చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని పాలకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన తప్పులను పట్టించుకోకుండా తిరిగి అవే తప్పులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బ్రిడ్జి చివర్లో కాంక్రీట్ నిర్మాణం చేయకుండా కేవలం మట్టి పోసి వదిలేశారని తెలిపారు. దీంతో వర్షాకాలంలో మళ్లీ మట్టి కొట్టుకపోయి బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు పట్టించుకోకపోతే దహెగాం మండల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. పాలకుల మాటలు పట్టించుకోకుండా బ్రిడ్జిని పటిష్టంగా నిర్మించాలని అధికారులను డిమాండ్ చేశారు. నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. నియోజకవర్గంలోని దహెగాం, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో పర్యటించి పలువురు పార్టీ కార్యకర్తల వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

మందమర్రి, ఫిబ్రవరి 23: మందమర్రి మండలం అందుగులపేట గ్రామ సమీపంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో హంగామా చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్ మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో వీడ్కోలు వేడుకలు నూతన ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సీసీసీ నస్పూర్ : సిల్వర్ జూబ్లీ వేడుకల్లో సీసీసీ సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థులు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 23: సీసీసీ టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నస్పూర్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగింది. పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు పట్టణంలోని ఫంక్షన్ హాలులో నిర్వహించారు. 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను ఏర్పాటు చేశారు. దాదాపు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆ నాటి గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జక్కుల మల్లేశ్, తొట్ల బుచ్చన్న, కారుకూరి రవీందర్, శ్రీనివాస్ శర్మ, ధన లక్ష్మి, రమాదేవి, రేఖా రాగూర్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 23 : కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మాశాలీ భవనంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) 1990-91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కెక్కడో స్థిరపడ్డ పదో తరగతి స్నేహితులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం ఒక చోటకు చేరుకొని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరితో ఒకరు తమ కష్టా సుఖాలు చెప్పుకొని, జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు చెప్పుకున్నారు. ఆనాటి గురువులు ఏఎస్ఆర్ మూర్తి, చక్రపాణి, శేషావతారం, భీమాసేన్ గుప్తా, రాజయ్య, బాపా గౌడ్, వెంకటేశ్వర్ రావు, జయప్రదను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, మల్లేశ్, సత్యనారాయణ, సయ్యద్ సాబీర్, వినోద, పద్మ, శారద, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, గురువులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,ఫిబ్రవరి 23: మెదక్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ -కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 27న జిల్లాలో జరుగనున్న పోలింగ్ లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థల్లో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. (ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధుల్లో వెసులుబాటు కల్పించడం లేదా సెలవు దినం ఇవ్వాలని తెలిపారు. ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని సూచించారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే కోవలక్ష్మి

వివాహ